క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని మహారాణిపేట ప్రాంతానికి చెందిన భవిరిశెట్టి వెంకట సత్య రాంప్రసాద్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని నగదురూపంలో ఆలయంలో సూపరింటెండెంట్ సునీల్‌కు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

మంచినీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు రామకృష్ణ జంక్షన్‌లోని చేపల బజారులో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును కార్పొరేటర్ తోట పద్మావతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో ఇప్పటివరకు మురళీధర వీధిలో ఒకటి, కొబ్బరితోటలో ఒకటి బోర్లు ఏర్పాటు చేశామన్నారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1500 రుసుం చెల్లించాలని సూచించారు.

పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు అడ్మిషన్లు



జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి, తదితరులు

డాబాగార్డెన్స్ : పదో తరగతి పరీక్షల్లో ఇటీవల ఫెయిల్ అయిన పలువురు విద్యార్థులకు మంగళవారం స్థానిక ఎంవీడీఎం హైస్కూల్లో తిరిగి అడ్మిషన్లు కల్పించారు. ఉన్నత పాఠశాలల ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల పదో తరగతిలో ఫెయిల్ అయిన పది మంది విద్యార్థులకు ఆమె నేతృత్వంలో అడ్మిషన్లు కల్పించారు. అనంతరం అడ్మిషన్లు పొందిన వారికి జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌వీ శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ నారాయణరావు

డాబాగార్డెన్స్: అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది జగనన్న ప్రభుత్వమేనని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 29వ వార్డు దండుబజార్ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావుతో కలిసి పలువురికి ఎమ్మెల్యే గణేష్‌కుమార్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతీ ఇంటిని సందర్శించి 570 మంది సమస్యలు గుర్తించి, నమోదు చేశారన్నారు. అందులో 30 శాతం పనులు పూర్తి చేసి సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు పూర్తిగా అందేలా చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందని, ఇంకా అర్హతున్నా లబ్ధి పొందకుండా మిగిలిన వారిని గుర్తిస్తున్నామన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా శత శాతం పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమ క్యాంపుల్లో 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ, వివాహం, ఫ్యామిలీ మెంబర్, డెత్ సర్టిఫికెట్లు, బియ్యం కార్డులు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యూటేషన్లు, ఫోన్ నంబరుకు ఆధార్ లింకేజీ సర్టిఫికెట్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని జగనన్నకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ నీలాపు లక్ష్మి, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏసీపీ వినయ్, ఏపీడీ పుణ్యవతి, డీఈఈ వెంకటేష్, సచివాలయ సిబ్బంది, ఆర్వోలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

శాకంబరిగా బంగారమ్మ



శాకంబరి అలంకరణలో అమ్మవారు

డాబాగార్డెన్స్: నగరంలోని 29వ వార్డు పరిధి ప్రకాశరావుపేటలో వెలసిన బంగారమ్మను మంగళవారం శాకంబరిగా అలంకరించారు. అమ్మవారి ప్రాంగణాన్ని వేపకొమ్మల తోరణాలతో తీర్చిదిద్దారు. ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం బంగారమ్మ ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో బోనాలు సంబరం, యల్లమ్మ గుడికి వెళ్లి పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మకు పసుపు కుంకుమ సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందునికి ఘన నివాళి

అల్లిపురం: స్వామి వివేకానందుని వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. సౌత్ జైలు రోడ్డులోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ నేటి యువత వివేకానందుని ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీశెట్టి రాజు, ఆదారి వెంకట మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ఆధునికీకరణ

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ కోర్టును రూ.2.5 లక్షల వ్యయంతో ఆధునికీకరించారు. సెంటినరీ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఆధునికీకరించిన కోర్టును ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వి.మన్మథరావు, ఆర్.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిటూ) ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లపు తులసి కోరారు. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో కోత విధిస్తోందన్నారు. అంగన్‌వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని పోరాడాల్సి వస్తోందన్నారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, ఐసీడీఎస్‌ను రక్షించుకునేందుకు బడ్జెట్లో నిధులు పెంచాలని, పని భారం తగ్గించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 10, 11 తేదీల్లో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.జ్యోతీశ్వరరావు, శోభారాణి, వెంకటలక్ష్మి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితంపై డాక్యుమెంటరీ

ఏయూ క్యాంపస్: అల్లూరి సీతారామరాజు జీవితంపై విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి డాక్టర్ కె.సత్యనారాయణ అధ్యయనం చేసి తీర్చిదిద్దిన డాక్యుమెంటరీని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్(ఐసీసీఆర్) డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్ ఆవిష్కరించారు. అల్లూరి జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను సమగ్రంగా దీనిలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం ఆదర్శనీయం



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

అల్లిపురం : శాఖా గ్రంథాలయంలో మంగళవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, పాఠకులు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరు అలవరుచుకోవాలన్నారు. తన పోరాట పటిమతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన ధీరుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.

మహారాణిపేట : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంగళవారం కేజీహెచ్‌లో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా సీతారామరాజు చిత్రపటానికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కె.వాసుదేవ, ఏఆర్ఎంవో డాక్టర్ కె.జగదీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, కల్పన, పి.ధనుంజయరావు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో విగ్రహం ఏర్పాటు చేయాలి

జగదాంబ: అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ కోరారు. అల్లూరి జయంతి వేడుకలు స్వచ్ఛంద సంస్థలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి విగ్రహం పార్లమెంట్‌లో పెట్టాలన్న కోట్లాది మంది భారతీయుల కోరిక నెరవేర్చాలన్నారు. పలువురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు నూనెమిల్లు వీధిలోని అల్లూరి విగ్రహానికి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పీవీఎస్ రాజు తదితరులు



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న జహీర్ అహ్మద్

వివేకానంద సంస్థ సేవలు అభినందనీయం



సీపీ త్రివిక్రమ్‌కు వివేకానందుని చిత్రపటం అందిస్తున్న అప్పారావు

డాబాగార్డెన్స్: వివేకానంద సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను నగర సీపీ త్రివిక్రమ్ వర్మ అభినందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ ఎలైట్ మంగళవారం నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని సంస్థ నిర్వహిస్తున్న సేవలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సీపీ స్పందిస్తూ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులను అభినందించారు. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రూ.10కే రోగి సహాయకులకు అందిస్తున్న భోజనం, సంస్థ నిర్వహిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా సీపీకి సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు స్వామి వివేకానంద చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.

‘ఉక్కు’ను కాపాడుకుంటేనే భవిష్యత్



దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 873వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షల్లో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పస్థిం, స్టోర్స్, ఎస్ఎండీ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



లక్ష్మీ టాకీస్ వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత సీట్లు, కళాశాలల్లో అడ్మిషన్లు, జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో ఉద్యోగాల నియామకాలు, తదితర సమస్యల పరిష్కారానికి తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, కొల్లి సింహాచలం, 30వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని దేవా తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన



సిరిపురం దత్ ఐల్యాండ్ ప్రాంతంలో పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మంగళవారం నగరంలో విస్తృత పర్యటన చేశారు. సిరిపురంలోని దత్ ఐల్యాండ్, బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్, ఎంవీపీ, హనుమంతవాక జంక్షన్, హెచ్‌బీ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దత్ ఐల్యాండ్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం గిరి ప్రదక్షిణ మార్గంలో రోడ్లను పరిశీలించారు. పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై పేపర్ ప్లేట్లు అతుక్కుపోయాయని, వాటిని నీటితో తడిపి హెయిర్ ప్రెషర్‌తో తొలగించాలని సూచించారు. రహదారులు మునుపటి వలే ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని జోనల్ కమిషనర్లను ఆయన ఆదేశించారు.

ఘనంగా దుర్గాలమ్మ జాతర



పూజలందుకుంటున్న దుర్గాలమ్మ

అల్లిపురం: రాచపోలమాంబ అమ్మవారి ఆలయంలో వెలసిన దుర్గాలమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలతో కుమ్మరవీధిలో గల పెద్దింటి నుంచి సంప్రదాయ డప్పు వాయిద్యాలు, తప్పెటగుల్లు, పులివేషాలు, చిన్నారుల కోలాటం, గరిడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ తిరువీధి ఉత్సవంలో ప్రారంభమైన అమ్మవారి పూలఘటాలు ప్రధాన పండగ వరకు రోజూ తిరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలపారు. అమ్మవారి తిరువీధి అల్లిపురం కుమ్మరవీధి నుంచి మెయిన్‌రోడ్డు సతకం పట్టు, సింహాలదేవిడి, చలువతోట, మార్కెట్ రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ మీదుగా గోకుల్ థియేటర్ దరి అమ్మవారి ప్రధాన దేవాలయానికి చేరుకుంది. అక్కడ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం జాతర ముగుస్తుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: హక్కుల ఉల్లంఘనకు గురైన బాధితులకు తమ కౌన్సిల్ అండగా ఉంటూ, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ తెలిపారు. నగరంలోని కౌన్సిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్లను ఆశ్రయించినప్పటికీ బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల కౌన్సిల్ 24వ వార్షికోత్సవం ఈ నెల 12న డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు శ్యాంప్రసాద్ తెలిపారు. దామోదర సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వీసీ ఆచార్య వై.సత్యనారాయణ, ప్రస్తుత వీసీ డాక్టర్ సుధ, పలువురు న్యాయ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్వీ రమణ, రావాడ నాయుడు పాల్గొన్నారు.

ఆక్రమణలో పూర్ణా మార్కెట్ ప్రధాన రహదారి



పూర్ణామార్కెట్ రహదారి మధ్యలో కూరగాయల విక్రయాలు

జగదాంబ: పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిని వ్యాపారులు ఆక్రమించేస్తున్నారు. నడిచే దారిలేక వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లోకి వెళ్లాలంటేనే నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. కనీసం వాహనాల పార్కింగ్‌కు సైతం వీల్లేకుండా రహదారి మధ్యలో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. తోపుడు బళ్ల వ్యాపారులు మరీ దారుణంగా వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని అడిగిన వారితో తగదాలకు దిగుతున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ సదుపాయం లేక కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చిన వారు సరకుల కోసం మార్కెట్ లోపలికి వెళ్లకుండానే బయట నుంచి వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి మార్కెట్ చుట్టూ ఉన్న అరటిపండ్ల సందు, వన్ వే రహదారిలో పెట్టిన దుకాణాలను వెంటనే తొలగించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ జోన్-4 టౌన్‌ప్లానింగ్ అధికారి వినయ్‌ప్రసాద్ వద్ద ప్రస్తావించగా పూర్ణామార్కెట్‌లో ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సెక్రటరీలతో కలిసి ఆక్రమణలు తొలగిస్తామని పేర్కొన్నారు.

నిస్వార్థ నాయకుల వల్లే స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం



సమావేశంలో ప్రసంగిస్తున్న మస్తానప్ప

ఉక్కునగరం: నాటి నిస్వార్థ రాజకీయ నాయకుల వల్లే విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఆవిర్భవించిందని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప అన్నారు. దేశంలోని 5వ ప్రతిపాదిత ఉక్కు కర్మాగారం విశాఖలో నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానానికి 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చిన నేపథ్యంలో అప్పటికే మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయాలని నాటి నాయకులు సంకల్పించారన్నారు. 1965 జూలైలో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయించారన్నారు. అటువంటి ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి పాల్గొన్నారు.